## ఎంపి, ఎమ్మెల్యేను కలిసిన సింగిల్ విండో ప్రెసిడెంట్




ఎంపి అంబికా లక్ష్మీనారాయణ,ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి పుష్పగుచ్ఛం అందచేస్తున్న గోవర్ధన్‌రాజు

పుట్లూరు, నవంబర్ 4 ప్రభాతవార్త

నూతనంగా ఎన్నికైన పుట్లూరు సహకార సంఘం అధ్యక్షులు గోవర్ధన్ రాజు మంగళవారం అనంతపురం ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తన ఎంపికకు కృషి చేసిన ఎంపి, ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాలు అందచేసి కృతజ్ఞతలు తెలియచేశారు. అదేవిధంగా మండల కూటమి నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ వైకుంఠం శ్రీనాథ్‌చౌదరి, కాయపాటి ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయికి ఎంపికైన పుట్లూరు విద్యార్థులు

పుట్లూరు, నవంబర్ 4 ప్రభాతవార్త




రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు

పుట్లూరు మండల కేంద్రంలోని జెడ్‌పి హై స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అనంతపురంలో జరిగిన స్కూల్ గేమ్స్‌లో భాగంగా కురాష్ క్రీడలో పాఠశాలకు చెందిన ఇ.నాగేష్, జి.నరేష్‌లు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జునయాదవ్, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, మండల విద్యాధికారులు శ్రీదేవి, ప్రేమ్‌కుమార్‌లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో రాణించి జిల్లాకు ఖ్యాతి తేవాలని పాఠశాల సిబ్బంది, బిసిహెచ్‌డబ్ల్యు శివారెడ్డి, పూర్వ విద్యార్థులు, గ్రామపెద్దలు, గ్రామస్తులు ఆకాంక్షించారు.

## విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ



విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేసిన దృశ్యం

తాడిపత్రిటౌన్, నవంబర్ 4 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని హైస్కూల్‌లో 6 నుండి 10వ తరగతి వరకు చదువుతున్న 20 మంది విద్యార్థులకు దాదాపు 14 వేలు విలువ చేసే కంటి అద్దాలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ అద్దాలను సూర్య ఎలక్ట్రికల్ షాప్ ఆదినారాయణరెడ్డి సహకారంతో అందచేశారు. ఆయనకు లయన్స్ క్లబ్ తరుపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షులు టి.సంజీవరెడ్డి, నాగేశ్వరరెడ్డి, ఆదినారాయణరెడ్డి, అనురాధ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయికి ఎంపికైన కృతిన్ కార్తికేయ



రాష్ట్ర స్థాయికి ఎంపికైన కృతిన్ కార్తికేయ

తాడిపత్రిటౌన్, నవంబర్ 4 ప్రభాతవార్త

పట్టణంలోని కిడ్స్ కేవ్ అకాడమీకి చెందిన యువ క్రికెటర్ కృతిన్ కార్తికేయ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో భాగంగా రాష్ట్ర స్థాయి క్రికెట్ జట్టుకు ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో అద్భుత ప్రతిభ చూపిన కృతిన్ కార్తికేయ రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం పట్ల కోచ్‌లు పవన్‌కుమార్‌రెడ్డి, హాజీవలి, దాదు తదితరులు అభినందనలు తెలిపారు. కృతిన్ కార్తికేయ రాష్ట్ర జట్టులో ఎంపిక కావడంతో స్థానిక క్రీడాభిమానులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

## ఎన్ ఆర్ ఫర్టిలైజర్ షాప్ లైసెన్సు రద్దు

ఏడిఏ జి ఎం అల్తాఫ్ అలీ ఖాన్.



ఎన్ ఆర్ ఫర్టిలైజర్ షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు.

అనంతపురం రూరల్, నవంబర్ 04 ప్రభాతవార్త

అనంత రూరల్ మండలం పాపంపేట పరిధిలో గల ఎన్ ఆర్ ఫర్టిలైజర్స్ దుకాణం లైసెన్సును రద్దు చేయడం జరిగిందని ఏ డి ఏ జ్ ఎం అల్తాఫ్ అలీ ఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనగనపల్లి మండలం బోయవాండ్ల కొట్టాల గ్రామం రైతు మోహన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా వ్యవసాయ అధికారి వారి ఆదేశాల మేరకు కళ్యాణ్‌దుర్గం రోడ్ లోని ఎన్.ఆర్ ఫర్టిలైజర్స్ దుకాణంలో ఏఓ వెంకటకుమార్‌తో కలసి అక్టోబర్ 30న సంయుక్తంగా తనిఖీలు నిర్వహించడంతో దుకాణదారులు ఎటువంటి ధరల పట్టిక లో స్టాకును పొందుపరచలేదు అదేవిధంగా స్టాక్,రిజిస్టర్, కానీ బిల్లుబుక్ గాని నిర్వహించలేదని,అదే విధంగా మూడు కంపెనీలకు చెందిన ఎరువులను, ఎరువులకుప్రభుత్వముఅనుమతిలేదు అదే విధంగా మూడు ఆటోలలో కోరమాండల్ కంపెనీకి చెందిన 120 బస్తాల కాంప్లెక్స్ ఎరువు ఎటువంటి బిల్లులు లేకుండా ఉండడంను గమనించి పై ఎరువులను విలువ దాదాపుగా 26 లక్షలు విలువగల ఎరువులను సీజ్ చేసి అదే విధంగా ఆ మూడు ఆటోలను తగు భద్రత నియత్తము రూరల్ పోలీస్ స్టేషన్ వారికి అప్పజెప్పడమైనది అంతేకాక దుకాణం దుకాణం దారునిపై తదుపరి చర్యలు తీసుకోవాల్సిందిగా రూరల్ పోలీస్ స్టేషన్లో మండల వ్యవసాయ అధికారి వారు ఫిర్యాదు చేసి దుకాణదారునికి షోకాజ్ నోటీసు జారీ చేయడం జరిగిందని, అదేవిధంగా దుకాణం లో బేయరు కంపెనీ కి చెందిన సోలమన్ 20 లీటర్ల,ఒబెరాన్ 9.5 లీటర్ల క్రిమి సంహారక మందుల కు ఇన్వాయిస్ లేనందున 113150/ విలువ గల క్రిమిసంహారక మందుల ను సీజ్ చేశామని అదే విదంగా, 26 లక్షల విలువైన ఎరువులను సీజ్ చేసి తదుపరి చర్యగా 26లక్షల ఎరువుల పై 6ఏ కేసు నమోదు చేశామని, అదే విదంగా ..కోరమండల్ కంపెనీకి, అవంతి వేర్ గోడౌన్ కి తాకిదులు జారీ చేశామని,ఈ తారీదులకు మూడు రోజులలో ఆ కంపెనీకి సంబంధించిన వివరణ ఇవ్వాలని లేనియెడల, కంపెనీపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఏడిఏ జి ఎం అల్తాఫ్ అలీ ఖాన్ తెలిపారు.

## బిజెపి సంస్థాగత సమావేశం



చిరంజీవిరెడ్డికి పుష్పగుచ్ఛం అందచేస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్, నవంబర్ 4 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణంలో మంగళవారం బిజెపి పట్టణ అధ్యక్షుడు చెన్నా రంగ నాయకులు ఆధ్వర్యంలో సంస్థాగత సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్టేట్ సేల్స్ కన్వీనర్ కన్నంపల్లి చిరంజీవిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక నాయకులు పుష్పగుచ్ఛం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మండల కమిటీని ఏర్పాటు చేయాలని, ప్రతి పోలింగ్ బూత్‌లో బూత్ అధ్యక్షులను మరియు బూత్ కమిటీని నియమించాలని అలాగే మీడియా సెల్ కన్వీనర్, కో కన్వీనర్లు నియమించాలని తెలియచేశారు. అనంతరం ఆత్మ నిర్భర్ భారత్ సంకల్ప ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి ఇంటికి వెళ్లి స్వదేశీ వస్తువుల వాడకం గురించి వివరించాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి స్టిక్కర్ అంటించి వారికి స్వదేశీ వస్తువుల వలన ఉపయోగం తెలియజేస్తూ ప్రతి ఒక్కరూ స్వదేశీ వస్తువులను వాడాలని వివరించాలన్నారు. దానివల్ల దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పాటు కల్పించినట్లు అవుతుందని ఆయన తెలియచేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ సభ్యులు, కర్నూలు జిల్లా ఇన్‌చార్జ్ జంగంరెడ్డి అంకాల్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మైదుకూరు ఆంజనేయులు, , పట్టణ ప్రధాన కార్యదర్శి ఓబిరెడ్డి, ఉపాధ్యక్షులు డి.వంశీ, మహిళా మోర్చా అమరావతి, సీనియర్ నాయకులు, పోలింగ్ బూత్ అధ్యక్షులు, పట్టణ కమిటీ సభ్యులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందచేస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్, నవంబర్ 4 ప్రభాతవార్త

ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో తాడిపత్రి పట్టణంలోని స్వామి వివేకానంద పాఠశాలలో పుట్లూరు మండలం గోపురాజుపల్లి గ్రామానికి చెందిన జయరంగారెడ్డి భార్య బయమ్మకు 20 వేల రూపాయల ఆర్థికసాయం అందచేశారు. దినసరి కూలి చేసుకుంటూ జీవనం సాగిస్తున్న జయరంగారెడ్డి ప్రమాదానికి గురై కాలువిరగడంతో అనంతపురంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆపరేషన్ కొరకు ఐదు లక్షల రూపాయలు ఖర్చవుతుందని సేవా సంస్థ దృష్టికి రావడంతో వారి ఆర్థిక పరిస్థితిని దృష్టిలో వుంచుకుని జయరంగారెడ్డి భార్య బయమ్మకు 20 వేల రూపాయలు అందచేశారు. ఆర్థికంగా చితికిపోయిన కుటుంబాలకు ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ అండగా నిలబడడమే ధ్యేయంగా పనిచేస్తోందని అధ్యక్షులు రామాంజనేయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు గురప్ప, అధ్యక్షులు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి రామేశ్వర్‌రెడ్డి, కన్వీనర్ దోగురు శ్రీహరి, వర్కింగ్ ప్రెసిడెంట్ నారబోయిన శంకర్, ట్రెజరర్ శ్రీరంగయ్య, ఉపాధ్యక్షులు కుమారస్వామి, సభ్యులు లక్ష్మీనారాయణ, వెంకటయ్య, హరి, నారాయణ, విజయ్‌కుమార్‌రెడ్డి, రమాకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## షూటింగ్‌లో శ్రీవాణి హైస్కూల్ విద్యార్థిని ప్రతిభ




కార్యక్రమంలో పాల్గొన్న ఎన్‌సిసి క్యాడెట్లు

తాడిపత్రిటౌన్, నవంబర్ 4 ప్రభాతవార్త

రైఫిల్ షూటింగ్‌లో తాడిపత్రి పట్టణంలోని శ్రీవాణి హైస్కూల్ విద్యార్థిని దీక్షితరెడ్డి ప్రతిభ కనబరిచింది. ఆల్ ఇండియా థల్ సైనిక్ క్యాంప్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొంది. ఇది క్యాడెట్లలో క్రమశిక్షణ, నాయకత్వం, జట్టుకృషి, దేశభక్తి వంటి లక్షణాలను పెంపొందించడంపై దృష్టి పెడుతుంది. శిక్షణ శిబిరం భూ బలగాలకు (ఆర్మీ) సంబంధించిన నైపుణ్యాలను మెరుగుపరచడానికి రూపొందించబడింది. ఇది ఎన్‌సిసిలోని అత్యంత ప్రతిష్టాత్మకమైన మరియు కఠినమైన శిబిరాలలో ఒకటని, అలాంటి ఎన్‌సిసి తల్ సైనిక్ క్యాంపులో అంచలంచలుగా ఎదుగుతూ న్యూఢిల్లీ వరకు వెళ్లి 0.22 రైఫిల్ షూటిరగ్‌లో విద్యార్థిని దీక్షితరెడిన ప్రతిభ కనబరిచింది. దీక్షితరెడ్డిని ఎన్‌సిసి కమాండింగ్ ఆఫీసర్స్, శ్రీవాణి విద్యా సంస్థల అధినేత ఎం.గంగాధర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అరటి ఆధారిత ఉత్పత్తుల తయారీ యూనిట్ల ఏర్పాటుపై అవగాహన




అరటి వేస్ట్ భాగాల నుండి తయారు చేసిన బ్యాగులు

పుట్లూరు, నవంబర్ 4 ప్రభాతవార్త

అరటి ఆధారిత ఉత్పత్తుల తయారీ యూనిట్ల ఏర్పాటుపై ఆసక్తి కలిగిన యువతీ యువకులకు ఈ నెల 6వ తేదీన రాప్తాడు వద్ద వున్న టిటిడిసిలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఏపిఎం వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్లూరు మండలంలో అరటి సాగు ఎక్కువగా ఉందని, కావునా అరటి పంట తరువాత వేస్ట్‌గా తీసి వేస్తున్న భాగాల నుండి దాదాపు 12 రకాల ఉత్పత్తులను తయారు చేసి మార్కెట్ చేయవచ్చన్నారు. నిరుద్యోగులైన యువతీ యువకులు ఇటువంటి యూనిట్లు ఇంటిలోనే ఏర్పాటు చేసుకుని ఖాళీ సమయంలో రోజుకు రెండు గంటలు పని చేస్తే నెలకు 15 వేల నుండి 20 వేల రూపాయల వరకు సంపాదించుకునే అవకాశం ఉంటుందన్నారు. దీనికి అయ్యే పెట్టుబడి రుణం రూపంలో ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇందులో 50 శాతం సబ్సిడీ కూడా ఉంటుందన్నారు. కావునా ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు ఎస్‌హెచ్‌జి సభ్యులు, వెలుగు సిబ్బందిని సంప్రదించాలని ఆయన తెలియచేశారు.

## రైలుకిందపడి వ్యక్తి ఆత్మహత్య

తాడిపత్రిటౌన్, నవంబర్ 4 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణం పుట్లూరు రైల్వే గేట్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి (55) రైలుకిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఈ సంఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



రైలుకిందపడి మృతి చెందిన వ్యక్తి

## విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవరుచుకోవాలి

ఓబుళదేవరచెరువు, నవంబర్ 4, ప్రభాతవార్త



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎంఈఓ సురేష్

ప్రతి విద్యార్థి పాఠశాల స్థాయి నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని అలవరుచుకోవాలని మండల విద్యాశాఖాధికారి సురేష్ బాబు, హెచ్ యం శిరీషా పేర్కొన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక ఉపాధ్యక్షులు కట్టుబడి గౌస్ లాజమ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మూఢనమ్మకాలను పారదోలడానికి ప్రతి ఒక్కరు ప్రజల్లో చైతన్యం తేవాలి అని పిలుపునిచ్చారు. మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ కు రెయిన్బో ఇంగ్లీష్ మీడియం పాఠశాల, ఓబులదేవరచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో రత్న శేఖర్ రెడ్డి, ఆయేషా, రోహిత్ కుమార్ రెడ్డి, లక్ష్మీ వరప్రసాద్, మానస, సింధుశ్రీలు ప్రథమ స్థానం పొందారు. మండల విద్యాశాఖాధికారి సురేష్ బాబు, హెచ్ యం శిరీషా, జన విజ్ఞాన వేదిక ఉపాధ్యక్షులు కట్టుబడి గౌస్ లాజమ్,ఉపాధ్యాయులు పవన్‌కుమార్,గౌరీ శంకర్‌రెడ్డి, బాబావలి, జనార్ధన జనార్ధన్‌రెడ్డి, రమేష్ నాయక్, కృష్ణవేణి, రాధ విద్యార్థుల కు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు .

## కీచక ఉపాధ్యాయుడు సస్పెన్షన్



ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయుడు జగదీష్‌కు సమస్యను వివరిస్తున్న విద్యార్థినిల తల్లిదండ్రులు

వజ్రకరూరు నవంబర్ 4 ప్రభాతవార్త

మండలంలోని వెంకటం పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినిలు పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఉపాధ్యాయుడు సుధాకర్ ను ఉన్నతాధికారులు మంగళవారం సస్పెండ్ చేశారు. విద్యాబుద్ధులు నేర్పాల్సిన గురువులు వికృత చేష్టలతో వృత్తికి కళంకం తెచ్చేలా వ్యవహరిస్తూ గౌరవమైన ఉపాధ్యాయ వృత్తిని అప్రతిష్టపాలు చేసేలా వ్యవహరిస్తూ, విద్యార్థినిలను తాకరాని చోట్ల తాకుతూ, డబుల్ మీనింగ్ వచ్చేలా విద్యార్థినులతో మాట్లాడుతూ వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. కొంతమంది ధైర్యంగా వారి కుటుంబ సభ్యులకు విషయాన్ని తెలిపారు. వారి తల్లిదండ్రుల ఆగ్రహానికి లోనై పాఠశాల వద్దకు వచ్చి ఆందోళనకు దిగారు. కఠిన చర్యలు తీసుకోవాలని, జిల్లా ఉన్నతాధికారులకు జరిగిన సంఘటన తెలుపుతూ నివేదిక పంపాలని కోరారు. విషయం తెలుసుకున్న ఎంఈఓలు ఎర్రిస్వామి, తిమ్మప్పలు పాఠశాలకు చేరుకొని ఉపాధ్యాయులను విచారించారు. అనంతరం తరగతిగదికి వెళ్లి విద్యార్థులను బయటకు పంపి విద్యార్థినిలను విచారించారు. ఈ విచారణలో పలు విస్తుపోయే అం శాలను వారి దృష్టికి విద్యార్థినిలు తీసుకువచ్చారు. విద్యార్థినిలు తమకు జరిగిన ఘటనలను రాత పూర్వకంగా వివరించారు.నివేదికను తయారుచేసి వజ్రకరూరు జిల్లా పరిషత్ మీద పాఠశాలలో ఉన్న డివైఈవోకు అందజేశారు. పరిశీలించిన ఆయన ఉన్నతాధికారులకు సమాచారం అందించారు . జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు సస్పెండ్ చేసినట్లు ఎంఈఓలు తెలిపారు. పాఠశాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ట్రైనీ ఎస్సై కళ్యాణ్ పర్యవేక్షించారు.

## సైన్స్ టాలెంట్ టెస్టులో ప్రథమస్థానంలో కాకతీయ విద్యార్థులు

ధర్మవరంటౌన్, నవంబరు 4 ప్రభాతవార్త



ప్రతిభ కనబరచిన విద్యార్థులతో కాకతీయ విద్యానికేతన్ కరస్పాండెంట్, డైరెక్టర్లు

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మండలస్థాయి చెకుముఖి సైన్స్ టాలెంట్ టెస్టులో తమ పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిచిచినట్టు కాకతీయ విద్యానికేతన్ కరస్పాండెంట్ నిర్మలాదేవి, డైరెక్టర్లు శెట్టిపి సూర్యప్రకాశ్ రెడ్డి, శెట్టిపి పద్మలు పేర్కొన్నారు. టాలెంట్ టెస్టులో కాకతీయ పాఠశాల విద్యార్థులు అంజుమ్, జస్వంత్ రెడ్డి, సాయిగౌరిలను కరస్పాండెంట్, డైరెక్టర్లతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టులో ప్రథమ స్థానంలో నిలడం హర్షనీయమన్నారు. భవిష్యత్తులో కూడా జిల్లా స్థాయిలో జరిగే టాలెంట్ టెస్టులో కూడా రాణించాలని వారు ఆకాంక్షించారు.

## గ్రామస్తులు చట్ట పరిధిలో జీవించాలి..!




గ్రామ సభలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ ఐ శ్రీనివాసులు

ధర్మవరం రూరల్ నవంబర్ 4 ప్రభాతవార్త

గ్రామస్తులందరూ చట్టపరిధిలోని జీవించాలని రూరల్ ఎస్ ఐ శ్రీనివాసులు తెలియజేశారు. ఈ సందర్భంగా మంగళవారం మల్లాకాల్వ గ్రామంలో ఎస్ఐ శ్రీనివాసులు తన సిబ్బందితో కలిసి గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో గ్రామస్తులతో ఎస్ఐ మాట్లాడుతూ గొడవలకు దూరంగా ఉండాలని గ్రామస్తులు అందరూ కలిసిమెలిసి ప్రశాంతంగా జీవించాలని మహిళల పట్ల గౌరవంగా ప్రవర్తిస్తూ పేకాటకు మద్యానికి బానిస కాకూడదని గ్రామంలో దొంగతనాలు జరగకుండా సీసీ కెమెరాలు బిగించుకోవాలని ఏదైనా సమస్య ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ ఐ శ్రీనివాసులు గ్రామస్తులు తెలిపారు.

## సీఐటీయూ నాయకుడి మృతికి నివాళి



సీఐటీయూ నాయకుడి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం రైతుసంఘం నాయకులు

ధర్మవరంటౌన్, నవంబరు 4 ప్రభాతవార్త

సీఐటీయూ నాయకుడు సయ్యద్ హైదరవలీ తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న రైతుసంఘం జిల్లానాయకులు జంగాలపల్లి పెద్దన్న, సీపీఎం సీనియర్ నాయకుడు ఎస్ హెచ్ భాష , సీఐటీయూ నాయకులు అయూబ్ ఖాన్, ఎల్ ఆదినారాయణ, చేనేత నాయకులు ఖాదర్ బాషా తదితరులు హైదర్ వలి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం, సీఐటీయూ పార్టీకి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

## జె డి ఏ ను కలిసిన జిల్లా వ్యవసాయ శాఖ విస్తరణ అధికారుల సంఘం నూతన కమిటీ సభ్యులు



జె డి ఏ కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు, నూతన కమిటీ సభ్యులు

అనంతపురం రూరల్, నవంబర్ 04 ప్రభాతవార్త

అనంతపురం జిల్లా వ్యవసాయ శాఖ విస్తరణ అధికారుల సంఘం ఎన్నికలు ఈనెల రెండున ఆదివారం నిర్వహించగా ఈ ఎన్నికలలో అనంత రూరల్ మండలంలో వ్యవసాయ శాఖ విస్తరణ అధికారిగా పనిచేస్తున్న బ్యాళ్ల మురళి కృష్ణ ను జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు, ఆయన ఆయనతోపాటు మిగతా సంఘ సభ్యులను కూడా ఎన్నుకున్న సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం లోమంగళవారం నూతనంగా ఏర్పడిన అనంతపురం జిల్లా వ్యవసాయవిస్తరణఅధికారుల సంఘం , ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ అధికారిని ఉమామహేశ్వరమ్మ ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం అధ్యక్షుడు బ్యాళ్ల మురళీకృష్ణ,జిల్లా కార్యదర్శి గుమ్మడం ఆదినారాయణ, కోశాధికారి కోశాధికారి పి.శ్వేత వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం స్టేట్ సెక్రటరీ కే. శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ సుజిత,జాయింట్ సెక్రెటరీ భాగ్యశ్రీ, కార్యవర్గ సభ్యులు అక్కమ్మ, నగేష్ కే.ఆంజనేయులు,రాము,పవన్ కుమార్ తదితరులు జిల్లా వ్యవసాయ అధికారిని మర్యాదపూర్వకంగా కలిశారు.

## గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

టిడిపి ఎస్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే వీరాంజనేయులు.

అనంతపురం రూరల్, నవంబర్ 04 ప్రభాతవార్త:



ఎస్టి కమిషన్ సభ్యుడికి శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులుగా నియమితులైన వెంకటప్ప గిరిజన సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని టిడిపి ఎస్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే వీరాంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల ముద్దు బిడ్డ, పసుపు సైనికుడు, తెలుగుదేశం పార్టీకి నిరంతర శ్రామికుడు, గత 20 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీకి ఎనలేని సేవలు చేసినటువంటి యువకుడు, టిఎన్ఎస్ఎఫ్ విద్యార్థి విభాగంలో విద్యార్థుల సమస్యల కోసం ఎన్నో రాజీలేని పోరాటాలు చేసినటువంటి వ్యక్తి,పార్టీ గెలుపుకు, పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేసినటువంటి వ్యక్తి, యువగలం పాదయాత్రలో చురుగ్గా పాల్గొన్న యువకుడు, నా ఆత్మీయ మిత్రుడు పన్నర్స్ వెంకటప్ప కి ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులుగా నియమించడం చాలా సంతోషం శుభపరిణమన్నారు. మంగళవారం అనంతపురం స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి బొకే ఇచ్చి ఘనంగా సన్మానించి ప్రత్యేక అభినందనలు తెలిపిన సాకే వీరాంజనేయులు తెలుగుదేశం పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి బీసీ సంఘం నాయకులు డీకే రామలింగం, టిడిపి నాయకులు బళ్లారి గోపాల్, నవీన్,టీ ఎన్ ఎస్ యఫ్ నాయకులు శివ వీరానంద ప్రస్తుతానికి గిరిజనులు ఎదుర్కొంటున్నటు వంటి పలుసమస్యలపై చిత్తశుద్ధితో పనిచేయాలని, గిరిజనుల అభివృద్ధి కోసం పాటుపడాలని తెలియచేయటం జరిగింది భవిష్యత్తులో మరెన్నో ఉన్నతమైన పదవులు అధిరోహించాలని మనస్ఫూర్తిగాకోరుకుంటున్నమన్నారు.

## చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో రెయిన్బో విద్యార్థుల ప్రతిభ

ఓబుళదేవరచెరువు,నవంబర్ 4, ప్రభాతవార్త



జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌కు ఎంపికైన విద్యార్థులు

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో రెయిన్బో ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. పదవ తరగతి విద్యార్థి రత్నశేఖర్‌రెడ్డి, తొమి మ్మదవ తరగతి అయేషా, ఎనిమిదవ తరగతి రోహిత్‌కుమార్‌రెడ్డిలను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయసింహరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, ఇనాయత్, మంజునాథ్, ప్రతాప్, ముత్యరాజు తదితర ఉపాధ్యాయ బృందం శుభాకాంక్షలు తెలియచేశారు. ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదల ఈ ఫలితం అన్నారు. జిల్లా స్థాయిలో జరిగే టాలెంట్ టెస్ట్ ఉత్తమ ప్రతిభ కనబరిచి విజయకేతనం ఎగురవేసి పాఠశాల కీర్తిప్రతిష్టలను మరింత పెంచాలని ఆయన అకాంక్షించారు.

## మండలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

నంబులపూలకుంట, నవంబర్ 4 ప్రభాతవార్త



పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

నంబులపూలకుంట మండలంలోని నంబుల పూలకుంట, వంకమద్ది గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి వి.లోకేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమం లో భాగంగా మొదటగా వరి నాలుగు ఎకరాలలో సాగు చేస్తున్న రైతు ఆవుల కొండారెడ్డి పొలాన్ని పరిశీలించారు. ప్రస్తుతం వరి గింజ నిండే దశలో ఉండి అక్కడక్కడ కాండంతొలుచు పురుగు, కంకి నల్లి, అగ్గి తెగులు ఉండడం గమనించినట్లు వారు తెలిపారు. దీని నివారణకై కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ 2గ్రా./ లీ లేదా ప్రొఫినోఫాస్ 2గ్రా./లీ, ట్రై సైక్లోజోల్ 75 1గ్రా./లీ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి అని సూచించారు. ఆముదం పంట వేరుశనగలో 2మీ. ఒకసాలు వేయడం వలన రెండు పంటలు కలిపి అధిక ఆదాయం పొందవచ్చు అని తెలిపారు. అలాగే వంకమద్ది గ్రామంలో సాగు చేస్తున్న వేరుశనగ (రబీ), మినుము ( లేట్ ఖరీఫ్) పంటలను ఆయా రైతులు రవీంద్ర, చంద్రశేఖర్, గంగయ్య మరియు రైతు సేవా కేంద్ర సిబ్బందితో పొలాలను పరిశీలించారు.

## చెకుముఖి మండల స్థాయి పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు

నంబులపూలకుంట, నవంబర్ 4 ప్రభాతవార్త



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల నంబులపూలకుంటలో చెకుముఖి మండల స్థాయి పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు మండలంలో ఉన్న అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షను పాఠశాల ఉపాధ్యాయులు డి. శివయ్య, ముర్షిద్‌లు నిర్వహించారు. ఇందులో టిఎన్.పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వి.శిరీష, ఎస్.సోమేశ్వరి, వై.గణేష్‌లు మండల స్థాయిలో ఉత్తీర్ణత అయి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ప్రకటించారు. వీరికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.వెంకటేశ్వర్లు సర్టిఫికెట్లు బహుమతి ప్రధానం చేశారు. వీరికి ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

06ATP27_06ATP27.qxd 04-11-2025 PM 10:31 Page 1



## నేడు గవిమఠంలో కార్తీక పౌర్ణమి దీపోత్సవం

### -సహాయ కమీషనర్, మేనేజర్ కె.రాణి

ఉరవకొండ, నవంబర్ 4 ప్రభాతవార్త



పట్టణంలోని ప్రసిద్ధ గవిమఠంలో స్వస్తిశ్రీ విశ్వావసు నామ సంవత్సరం కార్తీక శుద్ధ పౌర్ణమి బుధవారం సాయంత్రం 6.30 గంటల నుండి 8.30 గంటల వరకు కార్తీక దీపోత్సవం జరుగుతుందని గవిమఠ సంస్థానం సహాయ కమీషనర్, మేనేజర్ కె.రాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మఠం 8వ పీఠాధిపతి జగద్గురు చెన్నబసవ రాజేంద్ర మహాస్వామి ఆదేశాల మేరకు ఉదయం సుప్రభాత సేవ, గవిసిద్దేశ్వరస్వామికు, మఠం తొలి పీఠాధిపతి జగద్గురు కర్భ కరిబసవ రాజేంద్ర మహాస్వామి జీవ సమాధికు రుద్రాభిషేకాలు జరుగుతాయన్నారు. సాయంత్రం కార్తీక దిపోత్సవం జరుగుతుందని భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి దీపోత్సవంలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సహాయ కమీషనర్ పిలుపునిచ్చారు.

## ఇది చదువుకోవాల్సిన సమయం.. ప్రేమ పేరుతో మోసపోవద్దు..!

### -ఉరవకొండ అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సీఐ బి.మహానంది

### -ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం

ఉరవకొండ, నవంబర్ 4 ప్రభాతవార్త



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉరవకొండ యుపీఎస్ సీఐ బి.మహానంది

తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న నమ్మకానికి అనుగుణంగా బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అదిరోహించాల్సిన సమయంమిదని ప్రేమ పేరుతో ఆకర్షణకులోనై మోసపోయి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఉరవకొండ అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సీఐ బి.మహానంది అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డా॥డి.ఆదినారాయణ అధ్యక్షతన విద్యార్థినులకు అవగాహన సదస్సు జరుగగా ఆయనతో విశ్రాంత సీఐ సయ్యద్ చిన్నగౌస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ బి.మహానంది మాట్లాడుతూ తాము మేజర్లము చట్ట ప్రకారం తాము ఏమి చేసినా చెల్లుతుందని ఇష్టారాజ్యంగా వ్యవహరించి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను ఎదురి౦చి క్షణికావేశంలో ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దన్నారు. ఏది మంచి..ఏది చెడు అన్న విచక్షణ కలిగివుండి ఒక లక్ష్యాన్ని నిర్ధేశించుకొని బాగా చదివి రాణించాలన్నారు. విశ్రాంత సీఐ సయ్యద్ చిన్నగౌస్ మాట్లాడుతూ తన ఉద్యోగ జీవితంలో జరిగిన పలు ఉదాహరణలను వివరిస్తూ తల్లి తండ్రి గురువు ఆపై దైవమని గుర్తుంచుకొని తల్లిదండ్రులు చెప్పినట్లు నడుచుకొని జీవితాలకు బంగారు బాట వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.ఎన్.మస్తానప్ప, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా॥బి.వెంకటరాముడు, ఎం.పరమేష్, అధ్యాపకులు డా॥అయ్యన్న, సిరాజ్ అలీఖాన్, డా॥రాజశేఖర్, డా॥కృష్ణవేణి, డా॥రమేష్‌బాబు, నీలి వెంకటేశులు, సుధాకర్, ప్రశాంత్, రమేష్, రామాంజినేయులు, ప్రభాకర్, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్జి హల్లిలో పొలం పిలుస్తోంది

అగళి, నవంబర్ 4 ప్రభాతవార్త



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏఓ నాగరాజు

ఆర్జి పల్లి రైతు సేవాకేంద్రంలోని బొమ్మానవల్లి, హానుమనవల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఏఓ నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. వ్యవసాయ అధికారి రైతులతో రబి సీజన్‌లో వేసుకునే వివిధ పంటలలో పాటించ వలసిన మేలైన యాజమాన్య పద్దతులను వివరించారు. పంట నమోదు కార్యక్రమం గురించి తెలియజేశారు. నానో యూరియా, నానో డిఎపి ప్రాముఖ్యత, జిప్సం ఉపయోగాలను వివరించారు. వేరుశనగ, రాగి, మేత జొన్న, పూల పంటలను రైతులతో కలిసి సందర్శించి ఆ పంటలలో పాటించ వలసిన యాజమాన్య పద్దతులు సస్యరక్షణ పద్దతులను వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు, రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

## ఆత్మనిర్భర్ భారత్‌పై బిజెపి నాయకుల అవగాహన

### దుకాణాల లవద్దకు వెళ్లి స్థానిక వస్తువులనే కొనాలని, ప్రోత్సహించాలని చెబుతున్న దృశ్యం

అగళి, నవంబర్ 4 ప్రభాతవార్త



కరపత్రాలు, గోడ పత్రరికలను పంపిణీ చేస్తున్న బిజెపి నాయకులు

ఆత్మనిర్భర భారత్ స్వయం సంవృద్ధి భారత్ మన దేశంలో తయారు చేసిన వస్తువులను ప్రోత్సహిద్దామని, వాటినే కొనుగోలు చేద్దామని, ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారని అందులో భాగంగానే దుకాణాల వద్దకు వెళ్లి కరపత్రాలు, గోడిపత్రికలను అంటించడంతోపాటు అవగాహన కల్పిస్తున్నారు. స్వదేశీ స్వాభిమానం, స్వావలంభన, ఆపరేషన్ సింధూర్, భారత్ సైన్యం సరిహద్దులను దాటి స్వదేశీ పరిజ్ఞానంతో దేశాన్ని కాపాడుకోవడమే కాకుండా శత్రువులను కోలుకోని విధంగా దెబ్బతీసిందని తెలిపారు. ఇప్పుడు సరిహద్దులోపల మనందరం కలిసి స్వదేశీ మంత్రంలో భారత ఆర్థిక వ్యవస్థను పటిష్ట పరిచి దేశాన్ని బలమైన ఆర్థిక శక్తిగా నిర్మాణం చేద్దామని ప్రజలు స్వదేశీ వస్తు వినియోగాన్ని ప్రోత్సహించి ఓ కల్ ఫర్ లోకల్ స్వదేశీ నినాదంతో ముందుకు సాగినట్లైతే మన దేశంలో నూతన పరిశ్రమలను యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సృష్టించ వచ్చన్నారు. ఆర్థికంగా స్వయం సంవృద్దిని సాధించినప్పుడు ఏదేశమైనా అంతర్జాతీయ వేదికలపై తన వాణజని వినిపించ వచ్చన్నారు. స్వదేశీ నిర్ణయం భారతదేశాన్ని బలమైన శక్తిగా నిలబెట్టగలదు. ఇది కేవలం మన దేశ ఉత్పత్తులను ప్రోత్సహించడమే కాదు, మన దేశ భవిష్యత్తుకు మార్గ నిర్దేశం చేసే ఒక ఆర్థిక దౌత్య పరమైన ప్రస్థానానికి ప్రారంభం. మన దేశంలో పండుగ ఏదైనా మనం మరచిపోకూడదన్న పదం స్వదేశీ వస్త్రాలు, అలంకారాలు, మనం అవసరం ఏదైనా ఈ దేశంలో తయారయ్యే వస్తువులకు ప్రాధాన్యత ఇవ్వాలి, స్వదేశీ మన నిత్య విధానంగా మారాలి, మనందరిదీ ఒకటే మంత్రం ఓకల్ ఫర్ లోకల్ ఒకటే మార్గం ఆత్మనిర్భర భారత్, ఒకటే లక్ష్యం వికసిత భారత్. ఈ భావంతో మనం గర్వంతో ముందుకు సాగాలి. స్వదేశీ అంటే అంతర్జాతీయ వాణిజ్యాన్ని పూర్తిగా నిలిపివేయడం కాదు. అంతర్జాతీయంగా పోటీ పడగలిగే విధంగా మన దేశీ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవడం. దీనికి అనుగుణంగా భారత ప్రభుత్వం ప్రత్యామ్నాయ వ్యూహాలను అనుసరిస్తోంది. ప్రభుత్వానికి మనందరం సంపూర్ణంగా మద్దతు తెలియజేద్దాం. ఓకల్ ఫర్ లోకల్ స్వదేశీ విధానంతో కలిసి భారతదేశాన్ని నిర్మిద్దామని వివరించారు. కుటుంబ జీవనంలోనూ సామాజిక జీవనంలోనూ భారతీయ భాషలే మాట్లాడుతాను. పర్యవరణంపై జాగురుకత కలిగి ఉండి పర్యవరణ హితమైన, స్వదేశీ ఉత్పత్తులను వినియోగిస్తాను, విదేశీ పర్యటక ప్రాంతాలకు ప్రాధాన్యత ఇస్తాను, నా రోజువారి జీవనంలో సాధ్యమైనంత వరకు భారతీయ ఉత్పత్తులను వినియోగిస్తాను. దిగుమతి చేసిన ఉత్పత్తలకు బదులు స్వదేశీ ఉత్పత్తులనే ఎంచుకుంటాను. ఇంట్లోనూ ఎనిలోనూ సమాజంలోనూ భారతీయ ఉత్పత్తులకు ప్రాధాన్యతనిస్తాను. మన దేశ అన్నదాతలు, చేతి వృత్తి కళాకారులకు మద్దతు ఇచ్చి స్థానిక పరిశ్రమలను ప్రోత్సహిస్తాను. యువత, పిల్లలకు స్వదేశీ భావాన్ని అలవర్చుకునే ప్రేరణ కలిగించి కొత్త తరానికి స్వదేశీ ప్రాముఖ్యతను తెలియజేస్తాను అని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు ఈరచిక్కప్ప, ఆత్మనిర్భర భారత్ ఇన్‌చార్జ్ బసవరాజు, మండల బిజెపి అధ్యక్షులు విక్టోరియా, దొడ్డ రంగేగౌడ్, అశోక్ తదితరులు ఉన్నారు.

## ఆర్థిక అక్షరాస్యత ఐశ్వర్యానికి రాజబాట

### - నాబార్డ్ డీడీఎం అనూరాధ

### - ప్రీమియం చెల్లించి ప్రమాద బీమా పొందండి

### - సహకార సంఘం అధ్యక్షుడు. వీరాంజనేయులు



సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న నాబార్డ్ డిడిఎం అనురాధ

రొద్దం, నవంబర్ 4 ప్రభాతవార్త

గ్రామాల్లో ఆర్థిక అక్షరాస్యత పెంపొందించుకోవాలని తద్వారా ఐశ్వర్యానికి రాచబాట వేసుకొని దానికి మార్గం ఏర్పడుతుందని నాబార్డ్ డీడీఎం అనురాధ రైతులను ఉద్దేశించి తెలియజేయడం జరిగింది మండల కేంద్రమైన రొద్దం సింగిల్ విండో కార్యాలయం ఆవరణంలో సహకార సంఘం అధ్యక్షుడు వీరాంజనేయులు సమావేశానికి అధ్యక్షత వహించగా కార్యక్రమం గురించి అధికారులు మార్కెట్ యార్డ్ చైర్మన్ సింగిల్ విండో ప్రెసిడెంట్లు తెదేపా నాయకులు మాట్లాడుతూ రొద్దం సహకార సంఘం ఏర్పడి 115 సంవత్సరాలు పూర్తి కావస్తుందని ఇంతకాలంగా సహకార సంఘాన్ని ఈ ప్రాంత రైతులు ఖాతాలు పొంది ఈ సొసైటీని మంచి అభివృద్ధి దారిలో తీసుకుపోతున్నారని దీనికి తోడు ఇంతకాలంగా సహకార సంఘ ప్రెసిడెంట్లు అధికారులు రైతులకు చేదుడుగా ఉండి ఎప్పటికప్పుడు రైతులు తీసుకున్న రుణాలు రెన్యువల్ చేయిస్తూ మంచి గుర్తింపు పొంది రైతులకు నాణ్యమైన ఎరువులు అందుబాటులో ఉండే విధంగా కార్యాచరణ చేస్తున్నారని అభినందించడం జరిగింది ప్రతి ఒక్కరూ ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకం ద్వారా వార్షిక ప్రీమియం 20 రూపాయలు చెల్లిస్తే 2 లక్షల రూపాయల ప్రమాద బీమా లభిస్తుందని 18 సంవత్సరాల నుండి 70 సంవత్సరాలు వయసు గల బ్యాంకు ఖాతాదారులకు ఎలాంటి వైకల్యం జరిగిన మరణించిన ఈ బీమా వర్తిస్తుందని అంతేకాకుండా ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమా యోజన పథకం ద్వారా వార్షిక ప్రీమియం 430 రూపాయలకే రెండు లక్షల రూపాయల జీవిత భీమా లభిస్తుందని 15 సంవత్సరాల నుండి 50సంవత్సరాల వయసు గల బ్యాంకు ఖాతాదారులకు ఈ పథకం వర్తిస్తుందని మీ తరువాత మీ కుటుంబ సభ్యులకు ఈ భీమ వర్తిస్తుందని తెలియజేశారు నాబార్డ్ సహకారంతో అనేక సదుపాయాలు పొందే అవకాశం ఉంది మునుపటి రోజులు మాదిరిగా కాకుండా టెక్నాలజీ సహాయంతో ప్రతి ఒక్క విషయాన్ని తెలుసుకునేందుకు కార్యాలయాలన్ని సంప్రదించాలని రైతులకు తెలియజేశారు ఈ కార్యక్రమంలో సెంట్రల్ బ్యాంక్ మేనేజర్ సీఈఓ సురేఖ పెనుకొండ మార్కెట్ యార్డ్ చైర్మన్ రామకృష్ణప్ప హిందూపూర్ కోపరేటివ్ బ్యాంక్ అధికారి ఆదినారాయణ రమణారెడ్డి ఏ డి సి సి బ్యాంక్ మేనేజర్ నాగభూషణం కలిపి సహకార సంఘం అధ్యక్షుడు రామచంద్ర సూపర్వైజర్ రంగలక్ష్మి సెక్రటరీ వెంకటేశులు డైరెక్టర్లు ఓబులేసు నారాయణ తెదేపా నాయకులు చంద్రమోళి అశ్వర్థ నారాయణ శ్రీనాథ్ చౌదరి పవన్ కుమార్ సిద్దన్న పెద్ద చిక్కల్ రెడ్డి రైతులు గ్రామస్తులు తదితరులు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గౌని వారిపల్లి వాసికి అనంత ఆసుపత్రిలో పెన్షన్ అందజేత

గోరంట్ల నవంబర్ 4 ప్రభాతవార్త



ఆసుపత్రిలో పెన్షన్ అందజేస్తున్న దృశ్యం

మండలంలోని గౌని వారి పల్లి గ్రామానికి చెందిన చాకలి కిష్టప్ప అనారోగ్యంతో అనంతపురం ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్న నేపథ్యంలో లబ్ధిదారులకు ఇంటింటికి పెన్షన్లో భాగంగా వీఆర్వో నాగప్ప హాస్పిటల్ కి చేరుకుని పింఛన్ సొమ్మును అందజేసినట్లు గ్రామానికి చెందిన టిడిపి యువ నాయకులు డీలర్ రోహిత్ తెలిపారు. ఈ సందర్భంగా అనారోగ్యంతో బాధపడకు అనంతలో చికిత్సలు చేపించుకుంటున్న కిష్టప్ప స్పందిస్తూ అన్ని విధాలుగా ఇబ్బందుల్లో ఉన్న సమయంలో 100 కిలోమీటర్ల పైగా వచ్చి పెన్షన్ ఇవ్వడం అభినందనీయమని ఈ సహాయాన్ని మర్చిపోలేనని ఇటు స్థానిక నాయకులకు ప్రభుత్వానికి మంత్రి సవితమ్మకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## రోడ్డు పనులను పరిశీలించిన బీజేపీనేత

ధర్మవరంటౌన్, నవంబరు 4 ప్రభాతవార్త



రోడ్డు పనులను పరిశీలిస్తున్న బీజేపీ నియోజకవర్గ ఇన్చార్జ్ హరీశ్ బాబు

పట్టణంలోని కదిరిగేటు వద్దనుంచి స్మశాన వాటిక వరకు ఆర్అండ్ బీ ఆధ్వర్యంలో రోడ్డు గ్రావెల్ పనులు జరుగుతున్నాయి. ఈ పనులను బీజేపీ నియోజకవర్గ ఇన్చార్జ్ హరీశ్ బాబు మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పట్టణ ప్రజలు చాలా కాలంగా ఎదురుచూస్తున్న రహదారి అభివృద్ధి పనులు ఇప్పుడు వేగంగా ముందుకు సాగుతున్నాయన్నారు. మంత్రిసత్యకుమార్యాదవ్ పట్టణంలోని పలు ప్రాంతాలలో రహదారులు, డ్రైనేజీ, ఫ్లైఓవర్ తో పాటు పౌరసదుపాయాలు మెరుగుదలకు ప్రత్యేక దృష్టిసారించారన్నారు. కదిరిగేటు వద్ద నిర్మించబోయే కొత్త ఫ్లైఓవర్ కు సంబందించిన పలు సాంకేతిక, పరిపాలనా అంశాలు తుది దశకు చేరుకున్నాయన్నారు. త్వరలోనే ఫ్లైఓవర్ పనులు పూర్తి అయితే రవాణా వ్యవస్థ మరింత సులభతరం అవుతుందన్నారు. ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లబిస్తుందన్నారు.

## రైలుకిందపడి గుర్తుతెలియని యువకుడు ఆత్మహత్య

ధర్మవరంటౌన్, నవంబరు 4 ప్రభాతవార్త



రైలుకిందపడి మృతిచెందిన యువకుడు

ధర్మవరం రైల్వే స్టేషన్ సమీపంలోని కదిరిగేటు దగ్గరలో మంగళవారం ఉదయం ఓకి గుర్తు తెలియని యువకుడు రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నట్టు రైల్వే పోలీసులు తెలిపారు. మృతునికి 20 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుందన్నారు. మృతుడు లేత నీలిరంగు షర్ట్, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతుని ఆచూకి తెలిచిన వారు ధర్మవరం రైల్వే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. 8978656463, 9951325345 నెం బర్లకు ఫోన్ చేయాలని రైల్వేపోలీసులు తెలిపారు.

## తాడిమర్రి, బత్తలపల్లి మండలాల సాగునీటి అవసరాలపై మంత్రి ఆదేశాలతో చర్యలు ప్రారంభం

### - తాడిమర్రి-బత్తలపల్లి రైతుల కోరిక నెరవేర్చే దిశగా మంత్రి సత్యకుమార్ కీలక చర్య - పీఏబీఆర్‌కి నీటి తరలింపు ప్రణాళికపై ఇంజినీరింగ్ అధికారులతో హరీష్ బాబు సమీక్ష,

తాడిమర్రి, నవంబర్ 04 (ప్రభాతవార్త)



పీఏబీఆర్ నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న హరీష్ బాబు తదితరులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి మరియు ధర్మవరం నియోజకవర్గ శాసనసభ్యులు సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు, తాడిమర్రి మరియు బత్తలపల్లి మండలాల ప్రజల దీర్ఘకాలిక కోరిక అయిన సాగునీటి సమస్య పరిష్కారం దిశగా కీలక చర్యలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో, మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆదేశాలపై ఆయన నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు, పీఏబీఆర్ (పెన్నా అహోబిలం బ్యాలెన్స్ రిజర్వాయర్) ఇంజినీరింగ్ అధికారులతో కలిసి రాప్తాడు వద్ద ఉన్న హెచ్.ఎన్.ఎస్.ఎస్ (హంద్రీ–నీవా సుజల స్రావంతి) కెనాల్ వద్ద ప్రత్యక్షంగా పర్యటించారు. ఈ పర్యటనలో, తాడిమర్రి మరియు బత్తలపల్లి మండలాల సాగు భూములకు అవసరమైన నీటిని పీఏబీఆర్ లోకి ఎలా తరలించవచ్చో, సాంకేతికంగా ఏ మార్గాలు అన్వయించవచ్చో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా హరీష్‌బాబు మాట్లాడుతూ తాడిమర్రి,బత్తలపల్లి రైతులుకొన్ని సంవత్సరాలు గా సాగునీటి కోసం ఎదురుచూస్తున్నారు. మంత్రి సత్యకుమార్ యాదవ్, రైతుల ఈఆందోళనను గమనించి, తక్షణమే చర్యలుచేపట్టమని ఆదేశించారు. రాప్తాడు వద్ద ఉన్న హెచ్.ఎన్.ఎస్.ఎస్ కాలువ ద్వారా నీటిని పీఏబీఆర్ లోకి మళ్లించే ప్రణాళికను అధికారులు సాంకేతికంగా పరిశీలిస్తున్నారు. త్వరలో ఈ దిశగా ప్రభుత్వ స్థాయిలో నిర్ణయాలు తీసుకుంటాం," అని తెలిపారు. "మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రజల సమస్యల పట్ల ఎంతటి స్పందన చూపుతారో ఇది మరో ఉదాహరణ. ప్రజల కోరిక మేరకు, రైతుల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని, నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించే దిశగా కృషి కొనసాగుతుంది," అని హరీష్ బాబు తెలిపారు.

## విద్యార్థులకు బహుమతి అందజేత



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డివైఓ మల్లారెడ్డి, ఎంఈఓ లు ఎర్రి స్వామి, తిమ్మప్ప

వజ్రకరూరు నవంబర్ 4 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ ను నిర్వహించారు. ఈ టెస్ట్ లో విజేతగా నిలిచిన కొనకొండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మిన్హాజ్, రక్షిత, అస్లాం లకు డివైఈవో మల్లారెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈనెల 24న జిల్లాస్థాయి పోటీలలో వారు పాల్గొనను న్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఎర్రి స్వామి తిమ్మప్ప చెకుముకి టాలెంట్ టెస్ట్ కన్వీనర్, ప్రధానోపాధ్యాయుడు వెంకట్, ఉపాధ్యాయులు గౌసు నాగరాజు, శంకర్ తదితరులు పాల్గొననున్నారు.

## రామగిరిలో మండల స్థాయి చెకుముకి పోటీలు

రామగిరి, నవంబర్ 4 ప్రభాతవార్త



చెకుముకి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

మండలంలోని ఉన్నతపాఠశాల విద్యార్థులకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రామగిరిలో మండల స్థాయి సైన్స చెకుముకి పోటీలను మంగళవారం నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులు డివిజన్ స్థాయిలో పాల్గొంటారని పాఠశాల హెచ్ఎం మహాలక్ష్మి తెలిపారు. పేరూరు గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు 10వ తరగతి విజయ్‌కుమార్ ప్రథమస్థానంలో, 9వ తరగతి కె.అభి రెండవ స్థానంలో, 8వ తరగతి అభిరామ్ మూడవ స్థానంలో నిలిచారు. వీరు పేరూరులో గల బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

## జిల్లా స్థాయి క్రీడా పోటీలకు కనగానపల్లి జడ్పీహెచ్ స్కూల్ విద్యార్థుల ఎంపిక

కనగానపల్లి నవంబర్ 4 ప్రభాతవార్త



క్రీడాకారులతో హెచ్ఎం ప్రసన్నలక్ష్మి, పిడి రమేష్.

మంగళవారం మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్ విద్యార్థులు డివిజన్ స్థాయి ఎస్‌జిఎఫ్ ఖోఖో క్రీడాపోటీల నందు అద్భుతమైన ప్రతిభ కనబరచడంతో జిల్లాస్థాయి పోటీలకుఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రసన్నలక్ష్మి తెలిపారు. బతలపల్లి ఆర్డిటి స్టేడియం నందు డివిజన్ స్థాయి ఎస్‌జిఎఫ్ ఖోఖో క్రీడా పోటీలలో అండర్ 17 బాలికలు విన్నర్ ట్రోఫీనీ అండర్ 14 బాలురు రన్నర్ ట్రోఫీనీ అండర్17 బాలురు మూడవ స్థానం సాధించారు. ఇందులో ప్రతిభ కనపరిచిన 12 మంది క్రీడాకారులు అండర్ 17 విభాగంలో శ్రీనాథ్, ప్రతాప్, సంతోష్, వైష్ణవి, శ్రావణి, జెస్సీ, అర్చన, స్రవంతి అండర్ 14 లో చైతన్య, జస్వంత్, నగేష్, వర్షిత, తేజ, వర్సిత, బేబీలు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికఅయ్యారని ప్రధానోపాధ్యాయురాలు ప్రసన్నలక్ష్మీ తెలిపారు. క్రీడాకారులను పిడి రమేశ్ అభినందించారు.

## వడ్డెర్ల అభివృద్ధికి సహకరించండి

### కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వర్, డైరెక్టర్లు వలిపి శ్రీనివాసులు తదితరులు

కొత్తచెరువు నవంబర్ 4 ప్రభాతవార్త



బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మకి వడ్డెర్ల సమస్యలపై వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

విజయవాడ మంగళవారం లో రాష్ట్ర బీసీ సంక్షేమం మరియు జౌళి చేనేత శాఖామాత్యులు సవి తమ్మ ను వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లెల ఈశ్వర్, డైరెక్టర్ లు ఒలిపి శ్రీనివాసులు తదితరులు కలిసారు ఈ సందర్భంగా వడ్డెర్ల ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆమెకు వినతి పత్రం ద్వారా సమర్పించారు రాష్ట్రంలో వడ్డెర కులస్తులు చాలా వెనుకబడి ఉన్నారు కార్పొరేషన్ ద్వారా వృత్తిపరమైన వివిధ రకాల పనిముట్లు అందజేయాలన్నారు మహిళల అభివృద్ధికి కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు వడ్డెర కులస్తులు ప్రతిభావంతమైన విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు ఉన్నత విద్యాభ్యాసం కొరకు విద్యార్థులకు బ్యాంకుల ద్వారా ఆర్థిక సహాయం చేయాలన్నారు స్వయం సహాయకులుగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వారికి ట్రాక్టర్లు ఇన్నోవా ఇతర వాహనాలు మంజూరు చేసి ఆదుకోవాలని అన్నారు. కంకర మరియు రాళ్ల కొట్టే క్వారీ ల నందు దళారి వ్యవస్థ లేకుండా కష్టపడే వారికి ప్రాధాన్యత కల్పించాలన్నారు.

## పుట్టపర్తి బస్ స్టేషన్ ను మోడల్ స్టేషన్ గా తీర్చిదిద్దండి

పుట్టపర్తి(కల్చరల్), నవంబర్ 4, ప్రభాతవార్త

ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రమైన శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి కి వేల సంఖ్యలో అనునిత్యం శ్రీసత్యసాయి బాబాభక్తులు వస్తున్నందున పుట్టపర్తిలో ఉన్నటువంటి బస్ స్టేషన్ ను అధునాతన మోడల్ స్టేషన్ గా రూపుదిద్దాలని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమల రావు కు రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్ వీనతిపత్రం సమర్పించారు. మంగళవారం శ్రీసత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలను పర్యవేక్షించ దానికి వచ్చిన ఆర్టీసీ ఎండి ద్వారకా తిరుమల రావును మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ సత్య సాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తి నుండి హైదరాబాద్ ,విజయవాడ, విశాఖపట్నం, చెన్నై ,తిరుపతి ప్రాంతాలకు ఏసీ బస్సులను ఏర్పాటు చేయవలసిందిగా కోరమన్నారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ఏర్పాటు చేయడం స్వాగతిస్తూ ఉన్నామని అయితే డబ్బు చెల్లించి ప్రయాణం చేసే వినియోగదారులకు సరైన సేవలు అందించడానికి కృషి చేయాలని కోరమన్నారు. జిల్లా కేంద్రమైన పుట్టపర్తి నుండి నియోజకవర్గ కేంద్రాలకు ప్రతిరోజు బస్సులను కేటాయించాలనితిరుపతి మదనపల్లి మధ్య నడుపుతున్నటువంటి మినీ ఏసీ బస్సులను పుట్టపర్తి అనంతపురం నకు నడిపినట్లయితే వినియోగదారులకు ఇబ్బందులేకుండా ఉంటుందని తెలియజేశామన్నారు. మహిళలు వృద్ధులు అత్యధికంగా బస్సు ప్రయాణం సాగిస్తున్నందున బస్ స్టేషన్లలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని కోరినట్లు ఆయన తెలియజేశారు.

## హెచ్ఎం టీచర్ రగడపై డివైఈవో విచారణ

### గోప్యంగా విచారణ మీడియాను లోపలికి అనుమతించని డివైఈవో

వజ్రకరూరు నవంబర్ 4 ప్రభాతవార్త



విద్యార్థులకు భోజనాన్ని వడ్డిస్తున్న డివైఈవో మల్లారెడ్డి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చర్చినీ అంశంగా మారిన హెచ్ఎం స్వర్ణలత, ఉపాధ్యాయుని విజయ లక్ష్మి రగడపై మంగళవారం డివైఈవో మల్లారెడ్డి రాష్ట్రస్థాయి విద్యాశాఖ అధికారుల ఆదేశాలు మేరకు విచారణ చేపట్టారు. గత కొద్దిరోజులుగా పాఠశాలలో వివిధ కారణాలతో నిత్యం గొడవ పడుతూ ఒకరిపై ఒకరు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకుంటూ వస్తున్నారు. ఉన్నతాధికారుల నుండి ఎటువంటి చెరు లేకపోవడంతో మరో అడుగు ముందుకేసి రాష్ట్రస్థాయి అధికారులకు ఇద్దరు ఫిర్యాదు చేసుకున్నారు. దీని పై తీవ్రంగా స్పందించిన రాష్ట్ర స్థాయి అధికారులు డీఈఓ కు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో డివైఈవో మల్లారెడ్డిని విచారించి నివేదిక అందజేయమని డిఈఓ ఆదేశించారు. దీనిపై మంగళవారం డివైఈఓ పాఠశాలకు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న మీడియా వారు కవరేజ్ కి వెళ్ళగా లోపలికి అనుమతించలేదు. తాము సాధారణ పరిశీలనకు వచ్చామని ఏదైనా ఉంటే ఏమీ వాళ్ల తెలుపుతారని మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. మధ్యాహ్నం భోజన విరామం తరువాత హెచ్ఎం స్వర్ణలత టీచరు విజయలక్ష్మిని విచారించారు. అనంతరం పాఠశాల సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలోని వివరాలు బయటకు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. విచారణ నివేదికను జిల్లా కలెక్టర్కు అందజేయనున్నట్లు విశ్వసినీయ సమాచారం.

## ప్రభాస్ యోజన ద్వారా బిజెపిని బలోపేతం చేద్దాం

### బిజెపి రాష్ట్ర అగ్రికల్చర్ రీసెర్చ్ కో కన్వీనర్ సోమల ప్రకాష్ నాయుడు

తాడిమర్రి , నవంబర్ 4 (ప్రభాతవార్త)




సమావేశంలో మాట్లాడుతున్న సోమల ప్రకాష్ నాయుడు

భారతీయ జనతా పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రభాస్ యోజన ద్వారా మండలంలో బిజెపిని బలోపే తం చేసేందుకు ప్రతి ఒక్కరు కష్టపడి పని చేయాలని బిజెపి రాష్ట్ర అగ్రికల్చర్ రీచర్చ్ కో కన్వీనర్ సోమల ప్రకాష్ నాయుడు నాయకులకు కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల కన్వీనర్ దేవర రామ్మోహన్, ధర్మవరం నియోజకవర్గ కన్వీనర్ గంగుల కుంటగోపాల్ రెడ్డిల అధ్యక్షతనపార్టీ నాయకులు కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సోమల ప్రకాశనాయుడు మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు వివిఎన్ మాధవ్ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ మరియు జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్ ఆదేశాల మేరకు త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని గ్రామస్థాయి నుండి బీజేపీని బలోపేతం చేసే విధంగా బూత్ కమిటీలు, శక్తి కేంద్రాల తో పాటు నాయకులు కార్యకర్తలు సమన్వయంతో ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని అన్నారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎర్ర గంగు కృష్ణమనాయుడు, ప్రధాన కార్యదర్శులు ఆరువేటి ఆనంద్, భాస్కర్ నాయుడు, ఉపాధ్యక్షులు అనుగుత్తిరమణ, జిల్లాఎగ్జిక్యూటివ్‌మెంబర్ ఎస్పీపోతలయ్య, సి,రామాంజనేయులు, ఏటుకూరినాయుడు, ఆర్వేటి గంగాధర్, మాజీ సర్పంచ్ గోనుగుంట్ల వెంకట నాయుడు, డి.రామంజి, రాజశేఖర్‌నాయుడు, గోవిందు గంగులప్ప, నాగార్జున, సదా, పార్థసారథి, సీసీ రేవు ప్రసాద్, గంగయ్య, బిల్లేచంద్ర, తోపాటు పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు హాజరయ్యారు.

## మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు-2025 విజయవంతం



చెకుముకి సైన్స్‌లో అర్హత సాధించిన విద్యార్థులు

మడకశిర, నవంబర్ 04 ప్రభాతవార్త

స్థానిక సరస్వతి విద్యామందిర్ పాఠశాలలో మడకశిర మరియు రోళ్ళ మండలాల సంయుక్తంగా మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు–2025 ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జన విజ్ఞాన వేదిక ( జేవివి ) జిల్లా కార్యదర్శి శ్రీ విజి శ్రీనివాసులు మండల అధ్యక్షులు రమేశ్, ప్రధాన కార్యదర్శి డి. మారుతీ ప్రసాద్, కార్యదర్శి ఉమేష్ ల ఆధ్వర్యంలో 17 ఉన్నత పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొని సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు. ఈ పోటీలలో ప్రభుత్వ పాఠశాలల తరపున గౌడనహల్లి ఉన్నత పాఠశాల విద్యార్థుల జట్టు, ప్రైవేట్ పాఠశాలల తరపున సెయింట్ ఆన్స్ పాఠశాల విద్యార్థుల జట్టు, మరియు రోళ్ళ మండలం నుండి బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థుల జట్టు జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు–2025 కు అర్హత సాధించారు. వీరికి ప్రోత్సాహక బహుమతులను , ప్రశంసా పత్రాలను అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 17 ఉన్నత పాఠశాలల నుండి విద్యార్థులు పాల్గొని తమ శాస్త్రీయ జ్ఞానాన్ని, ప్రతిభను ప్రదర్శించారు. వివిధ శాస్త్రీయ అంశాలపై ప్రదర్శనలు, ప్రశ్నోత్తర పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతగా నిలిచిన విద్యార్థులకు మరియు వారిని మార్గనిర్దేశం చేసిన ఉపాధ్యాయులకు నిర్వాహకులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

# బూదగవి గ్రామంలో 'పొలం పిలుస్తోంది'

### -అవగాహన కల్పించిన ఏవో బి.రామకృష్ణుడు

ఉరవకొండ, నవంబర్ 4 ప్రభాతవార్త



పొలం పిలుస్తోంది కార్యక్రమం దృశ్యం

మండల పరిధిలోని బూదగవి గ్రామంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం జరిగింది. కంది పంటను పరిశీలించిన అనంతరం మండల వ్యవసాయాధికారి బి.రామకృష్ణుడు మాట్లాడుతూ కంది పంట ప్రస్తుతం పూత, కాయ దశలో ఉందని పంటకు మారుకా మచ్చల పురుగు, పచ్చపురుగు సోకే అవకాశం ఉన్నందున దీని నివారణకు నీమాస్త్రం అనే ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన మందును వినియోగించాలని సూచించారు. నీమాస్త్రంను తాజా ఆవు పేడ 2 కిలోలు తీసుకొని ఆవు మూత్రం 10 లీటర్లు, 200 లీటర్ల నీరు, బాగా దంచిన వేపాకులు 10 కిలోలు వేసి పదార్థాలన్నింటినీ బాగా కలియబెట్టి తిప్పి 48 గంటలపాటు మరగబెట్టి గోనె సంచితో కప్పి ఉంచాలన్నారు. రోజుకు రెండుసార్లు ఉదయం, సాయంత్రం రెండు నిమిషాలపాటు కుడి వైపునకు కలియతిప్పాలని 48 గంటల తరువాత పల్చటి గుడ్డతో నడపోసుకోవాలన్నారు. ఈ ద్రావణాన్ని తయారు చేసుకున్న నెల రోజులలోపు వినియోగించాలని సూచించారు. నీమాస్త్రం రసం పీల్చే పురుగులు, ఇతరత్రా చిన్న చిన్న పురుగులు పెట్టిన గుడ్లను పొదగనివ్వకుండా నివారిస్తుందని తెలిపారు. నీమాస్త్రం 200 లీటర్లు ఒక ఎకరానికి వినియోగించాలని, నీమాస్త్రాన్ని కందికి పిచికారి చేస్తే మారుకా మచ్చల పురుగు, పచ్చపురుగు గుడ్లను, చిన్న పురుగులను నివారిస్తుందని ఏవో వివరించారు.

# రాకెట్ల పీహెచ్‌సీలో ఆశ డే కార్యక్రమం

### -వివిధ అంశాలను వివరించిన వైద్యాధికారి డాక్టర్ పావని

ఉరవకొండ, నవంబర్ 4 ప్రభాతవార్త



ఆశ డే కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యాధికారి డాక్టర్ పావని

మండల పరిధిలోని రాకెట్ల పీహెచ్‌సీలో మంగళవారం ఆశ డే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ పావని మాట్లాడుతూ పిల్లల ఎదుగుదల, అభివృద్ధి, శ్వాసకోశ వ్యాధులు న్యూమోనియా, కుటుంబ నియంత్రణ కార్యక్రమంలో మగవారి పాత్ర, మైలురాళ్లు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ అంశాలపై ఐదేళ్లలోపు పిల్లలు గల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. నవంబర్ 15న జరిగే వరల్డ్ ప్రీ మెచ్యూర్ డే సందర్భంగా నెలలు నిండకనే జన్మించే పిల్లలకు కలిగే అనారోగ్య సమస్యలు గూర్చి వివరించారు. పీహెచ్‌సీ పరిధిలో బాల్య వివాహాలు జరుగకుండా, టీనేజ్ ప్రెగ్నెన్సీలు సంభవించకుండా అవగాహన కల్పించాలన్నారు. ఏఎన్ఎంలు, సీహెచ్‌వోలు అసంక్రమిత వ్యాధుల సర్వేను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో నాగరంగయ్య, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ షఫీ, హెల్త్ సూపర్‌వైజర్లు శేఖర్, స్వర్ణలత, హెల్త్ అసిస్టెంట్ నిమ్మల వెంకటేష్, ఏఎన్ఎంలు, సీహెచ్‌వోలు పాల్గొన్నారు.

# కడ్లే గౌరమ్మ ఉత్సవాల్లో విద్యుత్ దీపాలంకరణకై ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి వితరణ

### -కృతజ్ఞతలు తెలిపిన పాల్తూరు కడ్డే గౌరమ్మ ఆలయ కమిటీ

ఉరవకొండ, నవంబర్ 4 ప్రభాతవార్త



విలేఖరులతో మాట్లాడుతున్న ఆలయ కమిటీ సభ్యులు

నియోజకవర్గంలోని విడపనకల్లు మండలం పాల్తూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలోగల కడ్లే గౌరమ్మ ఆలయంలో జరిగే కార్తీక పౌర్ణమి ఉత్సవాలకు ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించడానికి, ఇతరత్రా సామాగ్రి కోసం ఎమ్మెల్సీ, శాసన మండలి ప్రివిలేజ్ కమిటీ ఛైర్మెన్ వై.శివరామిరెడ్డి ఆర్థిక సాయం అందించాలని ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. కడ్లే గౌరమ్మ ఉత్సవాలకు 1995 నుంచి నేటి వరకు కూడా ప్రతి ఏడాది ఈ సాయాన్ని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి అందిస్తున్నారన్నారు. దైవకార్యంలో పాలు పంచుకొంటున్న ఎమ్మెల్సీ కుటుంబం సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మహేష్, నాగప్ప, మాలింగ, ఉప సర్పంచ్ సుంకన్న, రామకృష్ణ, శ్రీనివాసులు, గాలప్పగారి బసవరాజు, వన్నూరుస్వామి, షబ్బీర్, జంగల్ వన్నూరుస్వామి, రాజు, మంజు, సురేంద్ర, నగేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# అగళిలో చురుకుగా పారిశుద్ధ్య పనులు

అగళి, నవంబర్ 4 ప్రభాతవార్త



పారిశుద్ధ్య పనులను చేయిస్తున్న కార్యదర్శి

అగళి ఎస్సీ కాలనీ, బోయ వీధిలో కార్యదర్శి రంగనాథ్ దగ్గరుండి పారిశుద్ధ్య పనులను చేయించారు. రోడ్లపై మురికి నీరు చల్లడం మూలంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, రోడ్లు అన్నీ దుర్గంధం వెదజల్లుతున్నాయని, చెత్తా చెదారం వేయడం మూలంగా దోమలు, ఈగలు అధికమై ప్రజలు రోగాల భారిన పడుతున్నారని, అందుకే మురికి నీరు పోవడానికి పారిశుద్ధ్య పనులు చేయించినట్లు కార్యదర్శి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు మురికి నీళ్లను రోడ్లపై వేయకుండా ఇంకుడు గుంతలను తవ్వుకోవాలని, దానికి ప్రభుత్వం డబ్బులు కూడా ఇస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు.

# చెకుముకి టాలెంట్ విజేత లిటిల్ ఏంజెల్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ మోడల్ స్కూల్

కనేకల్లు నవంబర్ 04 ప్రభాత వార్త



విజేతలుగా నిలిచిన లిటిల్ ఏంజెల్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థులు

కనేకల్లు మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ జడ్పీహెచ్ఎస్ బాయ్స్ స్కూల్ నందు మంగళవారం నిర్వహించారు. ఈ కాంపిటేషన్ నందు లిటిల్ ఏంజెల్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ చెందిన విద్యార్థులు మరియు మోడల్ స్కూల్ కు చెందిన విద్యార్థులు గెలుపొంది బహుమతులు అందుకున్నారు. లిటిల్ ఏంజెల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో పదవ తరగతి చదువుతున్న బి. తనుషా అలాగే తొమ్మిదో తరగతి చదువుతున్న జి స్నేహ ఎనిమిదో తరగతి చదువుతున్న జే రక్షిత విన్నర్లుగా నిలిచారు. అలాగే ఏపీ మోడల్ స్కూల్ లో పదవ తరగతి చదువుతున్న డి అఖిల తొమ్మిదో తరగతి చదువుతున్న ఎల్ ఇందుప్రియ ఎనిమిదో తరగతి చదువుతున్న బి కావ్య గెలుపొందారు. గెలుపొందన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో జడ్.పి.హెచ్.ఎస్ బాయ్స్ హెడ్మాస్టర్ శ్రీనివాస ప్రసాద్ ఉపాధ్యాయ బృందం మరియు సి ఆర్ ఎం టి దత్త రాజేష్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మడకశిరలో ఏర్పాటు కానున్న రెవెన్యూ డివిజన్ కార్యాలయం

మడకశిర టౌన్ నవంబర్ 4 ప్రభాతవార్త.

మడకశిర కేంద్రంగా రెవెన్యూ డివిజన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇందులో భాగంగా మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ సముదాయ భవనంలోని భవనాన్ని జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్,ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు,ఆర్డిఓ ఆనంద్ కుమార్,మాజీ ఎమ్మెల్సీ గుండుమలతిప్పేస్వామి పరిశీలన పరిశీలించారు. త్వరలోనే మడకశిర లో రెవెన్యూ డివిజన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. నూతన తాసిల్దార్ కార్యాలభవనాన్ని ఆర్డిఓ కార్యాలయంకు పాత తహసీల్దార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం నునట్లు తెలిసింది.

# ప్రజలకు అందుబాటులో ఉండాలి.. ఎంపీడీఓ జిలాన్‌భాష

శెట్టూరు, నవంబర్ 04 ప్రభాతవార్త



కార్యక్రమంలో మాట్లాడుతున్నఎంపీడీఓ

గ్రామీణ ప్రాంతాల్లో నుండి అనారోగ్యంతో సర్కారు దవాఖానుకు వైద్యం నిమిత్తంవచ్చేరోగికి అందుబాటులో ఉండి సరైన వైద్యం అందించాలని ఎంపీడీఓ జిలాన్ భాషవైద్య సిబ్బందిని హెచ్చరించారు. మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వాస్పత్రిని మంగళ వారం ఎంపీడీఓ సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది డాక్టర్ లిఖిత ఆధ్వర్యంలోఆశాడే నిర్వహించారు.అందులో భాగంగా ఎంపీడీఓ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... మండలంలో ఉన్న ఆర్.యం పి.పిఎంపీ ప్రయివేట్ ల్యాబ్ టెక్నీషియన్ లపై ప్రత్యేక నిఘా ఉంచాలని ప్రభుత్వ అనుమతులు లేని వారిపై చర్యలు చేపట్టాలన్నారు. అదే విదంగా ప్రజలతో అధికమైన ధరలకు చికిత్సలు చేసి అక్రమంగా సొమ్ము ను దండుకొంటున్నారు. కావున వారిపైప్రత్యేక నిఘా ఉంచాలని వైద్య సిబ్బంది పై మండిపడ్డారు. ఈకార్యక్రమంలో ఆశా కార్యకర్తలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యం



బెంగళూర్ లో మోకాళ్ల అపరేషన్ చేయించుకున్నవారితో డాక్టర్లు

ధర్మవరంటౌన్, నవంబరు 4 ప్రభాతవార్త

ప్రజల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత 25న ధర్మవరం ఎన్డీఏ కార్యాలయం నుంచి మోకాళ్లనొప్పులతో బాధపడుతున్న 25 మంది రోగులు, సంస్కృతి సేవాసమితి ఆధ్వర్యంలో బెంగళూరు పంపించారు. వీరికి బెంగళూర్ లోని వైదేహి ఆస్పత్రిలో 25 మందికి శస్త్ర చికిత్సలు విజయవంతమైందన్నారు. మోకాళ్ల నొప్పులతో బాదపడుతున్న పేద, మధ్య తరగతి ప్రజలకు ఉచిత శస్త్రచికిత్సలు అందించడం జరుగుతుందన్నారు.శస్త్రచికిత్సల ఖర్చులు, వైద్యసేవలు, ఆస్పత్రిలో ఉన్నతమైన చికిత్స సదు పాయాలన్నీ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచితంగా అందించడం గర్వించదగ్గ విషయమన్నారు.భవిష్యత్తులో మరింతమందికి ప్రజలకు ఇలాంటి సేవా కార్యక్రమాలు అందించడానికి కృషిచేస్తామని మంత్రి అన్నారు.

# గ్రామ స్థాయిలో ఆశావర్కర్లు కీలక పాత్ర వహించాలి

గుమ్మఘట్ట నవంబర్ 04 ప్రభాతవార్త



సమావేశంలో పాల్గొన్న వైద్యాధికారులు

మండల కేంద్రము లోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పి.హెచ్.సి) లో మంగళవారం ఆశా కార్యకర్తల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన డిపిఎంఓ నీలకంఠ, వైద్యాధికారులు రమేష్ షాలోం సందేశ్ మాట్లాడుతూ, ఆశా వర్కర్లు గ్రామీణ ఆరోగ్య వ్యవస్థకు కీలక పాత్ర వహించాలని పేర్కొన్నారు.ఆశా వర్కర్లు తల్లి-శిశు ఆరోగ్యం, గర్భిణీ స్త్రీల పర్యవేక్షణ, హై రిస్క్ కేసులు,పిల్లల ఆరోగ్య పరీక్షలు, కుష్ఠ,క్షయ వ్యాధి నియంత్రణ, టీకా కార్యక్రమం, పోషణ వంటి అంశాలపై గ్రామాల్లో ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు.రాబోయే ఆరోగ్య సర్వేలు మరియు శిబిరాల నిర్వహణపై మార్గదర్శకాలు అందించారు.ప్రభుత్వం ఆరోగ్య రంగంలో అమలు చేస్తున్న పలు సంక్షేమ కార్యక్రమాలు, సేవలను గ్రామస్థాయికి చేరవేయడంలో ఆశా వర్కర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. కార్యక్రమం అనంతరం ఆశా వర్కర్లు ప్రస్తావించిన సమస్యలు, సూచనలు స్వీకరించిస్పందించారు.సమావేశంలో పీహెచ్‌సిల వైద్యాధికారులు రమేష్,షాలోం సందేశ్, రాంకిషోర్,డిపిఎంఓ నీలకంఠ,ఆరోగ్య సిబ్బంది, ఎం ఎల్ హెచ్ పి లు,ఏఎన్ఎంలు మరియు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# విద్యతోనే విజ్ఞానం విజ్ఞానంతోనే భవిష్యత్తు

### ఎస్ఏపిఎస్ జూనియర్‌కాలేజీ, ఏఎన్‌కే డిగ్రీ కాలేజీలో గ్రాండ్ వెల్కమ్ పార్టీ

గోరంట్ల నవంబర్ 4 ప్రభాతవార్త




సమావేశంలో మాట్లాడుతున్న కరస్పాండెంట్.



జూనియర్ విద్యార్థులకు పూలతో స్వాగతం పలుకుతున్న దృశ్యం

విద్యార్థుల మధ్య స్నేహభావం ఉండే విధంగా జూనియర్ విద్యార్థులకు కళాశాల లోని సీనియర్ విద్యార్థులతో పూలు జల్లుతూ జూనియర్ విద్యార్థులకు స్వాగతం చేసిన స్నేహ పూర్వక స్వాగత వేడుకలు అందరినీ ఆకట్టుకున్నాయి. పట్టణం లోని ఎస్ ఎవి ఎస్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో కరస్పాండెంట్ కెంపుల లక్ష్మీనారాయణ, ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్య నారాయణ ఆధ్వర్యంలో మంగళవారం ఈ వేడుకలు నిర్వహించారు. మండలం కేంద్రంలోని ఎస్ఏపిఎస్ జూనియర్ కళాశాల, ఏఎన్‌కె డిగ్రీ కళాశాల ఆవరణలో శ్రీ వీరబ్రహ్మం ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కళాశాలలో అంగరంగ వైభవంగా ఫ్రెషర్స్ డే కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రధాన గేటు వద్ద నుంచి ఇంటర్ ఫస్టియర్ జూనియర్ విద్యార్థులకు మరియు డిగ్రీ ఫస్ట్ఇయర్ జూనియర్ విద్యార్థులకు సీనియర్‌విద్యార్థులు పూలతో స్వాగతం పలుకుతూ కళాశాలలోకి ఆహ్వానించారు.అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో కరస్పాండెంట్ కెంపుల లక్ష్మీనారాయణ, ప్రిన్సిపల్ డాక్టర్ సూర్య నారాయణలు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు విజ్ఞానంతోనే ఏర్పడుతుందని ఆవిజ్ఞానం విద్యార్థిదశనుంచే పునాది పడాలని విద్యార్థులకు సూచించారు.అనంతరం కళాశాల ప్రాంగణంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని వినూత్నంగా విద్యార్థులు కళాశాల సిబ్బందితో కళాశాల ప్రాంగణంలో కార్తీక వనభోజన కార్యక్రమాలు సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ శశికళ, అధ్యాపకులు రామాంజనేయులు, రమేష్, రిటైర్డ్ ఉద్యోగి నరసింహులు, జయప్రకాష్, శ్రీధర్ బాబు, రామకృష్ణ,నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# సత్యసాయి బాబా జయంతి ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిద్దాం

### అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,మాజీ మంత్రి పల్లె

పుట్టపర్తి టౌన్, నవంబర్ 04, ప్రభాతవార్త



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి

భగవాన్ శ్రీ సత్య సాయిబాబా 100వ జయంతోత్సవాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిద్దామని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అధికారులకు తెలిపారు. పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని కర్ణాటక నాగేపల్లి వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులు తోపాటు జాయ్ లుక్కాస్ జ్యువెలరీ కంపెనీ సహకారంతో 1కోటి 20 లక్షల సి ఎస్ ఆర్ నిధులతో చేపట్టిన పుడా చిల్డ్రన్ పార్క్ అభివృద్ధి పనులను మంగళవారం ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తో పాటు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి , ఆర్డీవో సువర్ణ ,పుట్టపర్తి కమిషనర్ క్రాంతికుమార్ , డిఈ నరసింహామూర్తి తో కలిసి పనులను పరిశీలించారు. చిత్రావతి రోడ్డు నుంచి దుర్గమ్మ దేవాలయం వరకు జరుగుతున్న పనులను పరిశీలించారు. అదేవిధంగా కర్ణాటక నాగేపల్లి బ్రిడ్జి వద్ద కూరగాయల సంత మార్కెట్ ను పరిశీలించాశారు.చిత్రావతి నది పరివాహక ప్రాంతం లో ఎలాంటి చెత్తాచెదారం వేయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ క్రాంతి కుమార్ కు సూచించారు. చిత్రావతి నది చుట్టుపక్కల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని అందుకు తగిన చర్యలు తీసుకోవాలని పబ్లిక్ హెల్త్ డి ఈ నరసింహమూర్తికి తగు ఆదేశాలు ఇచ్చారు. చిత్రావతి రోడ్డు ఇరువైపులా అక్రమ కట్టడాలను పూర్తిగా తొలగించి తారు రోడ్డు వేయాలని అధికారులకు సూచించారు. పట్టణంలో అన్ని డివైడర్లకు రంగులు వేయాలని అంతే కాకుండా డివైడర్ల మధ్యలో అందమైన పూల మొక్కలు ఏర్పాటు చేయాలని తెలిపారు. పట్టణంలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని అంతేగాకుండా మురుగునీరు రోడ్లపై ప్రవహించకుండా ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలనీ మున్సిపల్ కమిషనర్ను ఆదేశించారు. పుట్టపర్తిలో ప్లాస్టిక్ ను పూర్తిగా నిషేధించేలా గట్టిగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి స్పష్టం చేశారు. ఎమ్మెల్యే మాజీ మంత్రి వెంట స్థానిక పుట్టపర్తి టిడిపి నాయకులు టిడిపి పట్టణ కన్వీనర్ బోయ రామాంజనేయులు ,టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ,గంగాధర్ నాయుడు,కృష్ణ ప్రసాద్, శ్రీరాములు, బీజేపీ నాయకులు లాయర్ హరికృష్ణ,జ్యోతి ప్రసాద్, సూర్యనారాయణ, టీడీపీ నాయకులు కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# పురాతన చరిత్ర కలిగిన హేమావతి అభివృద్ధికి కృషి

### జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్

అమరాపురం నవంబర్ 4 ప్రభాతవార్త




మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దృశ్యం

సత్య సాయి జిల్లాలో పురాతన చరిత్ర కలిగిన అమరాపురం మండలం 7 వ శతాబ్దం నాటి హేమావతి ఎంజేరు సిద్దేశ్వర స్వామి దేవాలయం అభివృద్ధికి కృషి చేస్తానని సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ పేర్కొన్నారు. హేమావతి గ్రామంలోని టూరిజం అతిథి గృహం నందు హేమావతి పంచాయతీ అభివృద్ధికి చేపట్టాల్సిన ప్రణాళికలపై మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిల సమక్షంలో మంగళవారం జిల్లా, నియోజకవర్గ ,మండల స్థాయి ముఖ్య అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మానవాకృతిలో భక్తులకు దర్శనమిస్తున్న పురాతన దేవాలయాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం మరుగుదొడ్లు, త్రాగునీటివసతి, రెస్ట్ రూమ్ ల ఏర్పాటు తదితర మౌలిక వసతుల కల్పించడానికి కృషి చేస్తామన్నారు. అదేవిధంగా రథోత్సవం సందర్భంగా రోడ్డు ఇరుకున ఉండడంతో భక్తుల సౌకర్యార్థం రోడ్డువెడల్పుచేయడానికి కృషి చేస్తామన్నారు. ప్రస్తుతం దేవాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో మరమ్మతు పనులు చేయడానికి కేంద్ర పురావస్తు శాఖ పరిధిలో దేవాలయం ఉండడంద్వారా కేంద్రప్రభుత్వానికి దీనికి సంబంధించిన నివేదికను పంపి మరమ్మతుకు కృషి చేయడానికి ప్రయత్నం చేస్తామని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా హేమావతిని మోడల్ సోలార్ గ్రామంగా అభివృద్ధి చేయడానికి సోలార్ విలేజ్ గాఎంపికచేస్తామని ఆయనపేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామపంచాయతీ అభివృద్ధికి కావలసిన నివేదికలను ఎంపీడీవో రామారావు, ఆర్ డబ్ల్యు ఎస్‌డిఈ మునునాయక్ లు నివేదిక అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి లుమాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు హేమావతి పంచాయతీ దత్తత తీసుకోవడం ద్వారా అన్ని విధాల అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని వారు పేర్కొన్నారు. అనంతరం గ్రామ పంచాయతీలోనిప్రధాన సమస్యలను మాజీ సర్పంచ్ హనుమంతరాయప్ప, మండల క్లస్టర్ కన్వీనర్ కృష్ణమూర్తి, ఎంపీటీసీ ఓంకార్ స్వామీలు వివరిస్తూ శ్రీరామ్ రెడ్డి త్రాగునీటి పథకం తో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి డాక్టర్లు నియామకం, 108 వాహనం మంజూరు, చెక్ డ్యాం ల మరమ్మతు, హేమావతి నుండి శివరంనకు రోడ్డు ఏర్పాటు, అదేవిధంగా బస్సు సౌకర్యం, నాచేపల్లి సప్లై ఛానల్ ఏర్పాటు తదితర సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సత్వరమే హేమావతి గ్రామపంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తామని కలెక్టర్ తెలిపారు. అనంతరం హేమావతి పంచాయతీ నాయకులు కలెక్టర్ మరియు ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్సీలకు భారీ గజమాలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎల్ ఎస్ ఏ ఈ ఈ స్వరూప్ కుమార్, ఆర్డిఓ ఆనంద్ కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ డిఈ మునునాయక్, వెలుగు పీడీ నరసయ్య, తహసిల్దార్ లక్ష్మీనరసింహం, దేవదాయ శాఖ ఈవో నరసింహారాజు,సి ఎస్ డి టి నవీన్ కుమార్,ఎంపీడీవో రామారావు, రెవిన్యూ ఇన్స్పెక్టర్ విన్సెంట్ పాల్, వ్యవసాయ అధికారి మంజునాథ్ , ఏవో ఆరాధ్య, విద్యుత్ డి ఈ,విద్యుత్ ఏఈ సిద్దేశ్వర, ఆర్డబ్ల్యూఎస్ ఏ ఈ హరీష్, ఇరిగేషన్ ఏఈ భార్గవ్, డాక్టర్లు భార్గవ్, అంబరీష్ బాబు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రాష్ట్ర టిడిపి కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, మార్కెట్ యార్డ్ చైర్మన్ గురుమూర్తి,మండల కన్వీనర్ కృష్ణమూర్తి, సింగల్ విండోఅధ్యక్షుడు గణేష్,ప్రధాన కార్యదర్శి నాగరాజ్, మాజీ జెడ్పిటిసి నరసింహామూర్తి, జడ్పిటిసి పిఆర్ మూర్తి, మాజీ కన్వీనర్ శివరుద్రప్ప, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు జయకుమార్, టిఎన్టియుసి ఉపాధ్యక్షుడు రామచంద్రప్ప, ఆలయ కమిటీ కరేగౌడ్ ,క్లస్టర్ కన్వీనర్లు నవీన్ కుమార్, కృష్ణమూర్తి, క్లస్టర్ కోకన్వీనర్లు మంజు తారక్, చెన్నప్ప, సీనియర్ నాయకులు కుమారస్వామి, తిప్పజ్జ, మాజీ ఎంపీటీసీ శివకుమార్, ఓంకార్ స్వామి, తిమ్మయ్య, డీలర్ గౌడ, యువ నాయకుడు నాగోనపల్లి మంజునాథ్, తమ్మ రాయప్ప, జనసేన నాయకుడు సింగల్ విండోడైరెక్టర్ డాక్టర్ ధనంజయ, పార్లమెంట్ తెలుగు యువతఉపాధ్యక్షుడు రఘు, గోపి యాదవ్, డీలర్ తిరుమలేష్, రమేష్,ఎఫ్ ఎ గౌడరంగప్ప, డీలర్ల సంఘ అధ్యక్షుడు తిప్పేస్వామి, ఉపాధ్యక్షుడు స్టూడియో హనుమంతు, చెరువు సంఘం అధ్యక్షుడు ఈర మల్లప్ప, సీతారామప్ప, మార్కెట్ డైరెక్టర్ చంద్రశేఖర్ గుప్తా, ప్రభాకర్,ఆర్కాలజికల్ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# బూదగవి, వెలిగొండ, లత్తవరం తండాలో వైయస్సార్సీపి రచ్చబండ

### మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ






వెలిగొండ గ్రామంలో జరిగిన రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడుతున్న పార్టీ మండల పరిశీలకుడు డి. సురేష్, లత్తవరం తండాలో జరిగిన సంతకాల సేకరణ కార్యక్రమం

ఉరవకొండ, నవంబర్ 4 ప్రభాతవార్త



బూదగవి గ్రామంలో జరిగిన సంతకాల సేకరణ కార్యక్రమం

రాష్ట్రంలోని మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం పీపీపీ విధానం ద్వారా ప్రైవేటుకు అప్పగించడానికి వ్యతిరేకంగా వైయస్సార్సీపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.యస్. జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా ఉద్యమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని బూదగవి, వెలిగొండ, లత్తవరం తండా గ్రామాల్లో వైయస్సార్సీపి రచ్చబండ కార్యక్రమం జరిగింది. మాజీ ఎమ్మెల్యే, వైఎస్ఆర్సిపి నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వర రెడ్డి, విద్యార్థి విభాగం రాయలసీమ జోన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వై.ప్రణయ్ రెడ్డి ఆదేశాలతో జరిగిన రచ్చబండ కార్యక్రమంలో మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నిర్వహించాలని, ప్రైవేటుకు అప్పగించరాదంటూ ప్రజల నుండి సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పార్టీ గ్రామ, అనుబంధ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్ఆర్సిపి ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో అప్పటి ముఖ్య మంత్రి వై.యస్.జగన్మోహన్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి రాష్ట్రానికి కొత్తగా 17 మెడికల్ కళాశాలను మంజూరు చేయించి వాటి నిర్మాణాలను ప్రారంభించగా 2024 ఎన్నికల నాటికే 7 కళాశాలల నిర్మాణం పూర్తి కాగా 5 కళాశాలల్లో తరగతులు కూడా జరుగుతున్నాయన్నారు. మిగిలిన కళాశాలలను పూర్తి చేయడానికి 5,000 కోట్ల రూపాయలు ఖర్చు అవుతుండగా తమ ప్రభుత్వం వద్ద నిధులు లేవంటూ సీఎం చంద్రబాబు నాయుడు కళాశాలలను ప్రైవేటుకు అప్పగించడానికి నిర్ణయించడం దారుణం అన్నారు. కళాశాలలను ప్రైవేటుకు అప్పగిస్తే భవిష్యత్తులో పేద, మధ్యతరగతి విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షల మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎం.నరసింహులు, వెలిగొండ సర్పంచ్ వీరాంజనేయులు, బూదగవి సర్పంచ్ లక్ష్మీదేవి, లత్తవరం తండా సర్పంచ్ అన్నపూర్ణమ్మ, మండల సమన్వయకర్త మూలగిరిపల్లి ఓబన్న, రూరల్ మండల అధ్యక్షుడు జి.ఎర్రిస్వామి రెడ్డి, మాజీ ఎంపీపీ ఏ.సి.ఎర్రిస్వామి, ఎంపీటీసీ ఈశ్వర్ బాబు, పార్టీ పరిశీలకుడు డి.సురేష్, నాయకులు ధనుంజయ, నాగరాజు నాయక్, ప్రసాద్ నాయక్, వెంకటేష్ నాయక్ సిద్ధార్థ, బి.సి.మల్లి తదితరులు పాల్గొన్నారు.

# హంద్రీనీవా కాలువ పనులను పరిశీలించిన కలెక్టర్

గుడిబండ నవంబర్ 4 ప్రభాతవార్త

మండలంలోని హంద్రీనీవా కాలువ పనులను ఎంఎల్ఏ ఎంఎస్ రాజు, మాజీ ఎంఎల్సీ గుండుమల తిప్పేస్వామి, తెదేపా రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి లతో కలిసి కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హంద్రీనీవా కాలువ పనులు త్వరితగతిన పూర్తి చేసి నియోజకవర్గంలోని చెరువులకు నీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో తహశీల్దారు శ్రీధర్, డిప్యూటీ ఎంపిడిఓ నాగరాజు నాయక్, మండల వ్యవసాయ అధికారి వీరనరేష్, సింగిల్ విండో అధ్యక్షుడు మద్దనకుంటప్ప, తెదేపా మండల అధ్యక్షులు లక్ష్మీనరసప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, తెదేపా జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంజునాథ్, ఎంపిటిసి వనజా శశిధర్, సింగిల్ విండో డైరెక్టర్ ప్రకాష్, తెదేపా నాయకులు భోజరాజు, నజీర్, వెంకటేష్, కసాపురంచిత్తప్ప, నాగభూషణ్,రవిస్వామి తదితర ప్రభుత్వ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



కాలువ పనులను పరిశీలిస్తున్న దృశ్యం

